# ఓ పువ్వు రాలింది

**– ఐతా చంద్రయ్య**

బజారు వెళ్లాలంటే నిప్పులమీద నడిచినట్టనిపిస్తుంది. గుండెల్ని గుబగుబలాడించే ఎండ దుర్మార్గుని పౌరుషంలా మండిపోతోంది. బయట, లోపల కనకారావు మాస్టారు గుండె లోతుల్లో పాతాళగంగ తిరగాడుతోంది. నరాల్లో రక్తానికి బదులు నీరు ప్రవహిస్తోంది.

ఒళ్లో కూచోగానే ఎప్పుడూ కన్నతల్లిలా లాలించే పడక్కుర్చీ ఇప్పుడు కన్నెర్ర చేసిన కన్నతండ్రిలా చిటపటలాడ్తోంది. వారం క్రితం రిజిస్టర్ పోస్టులో అందిన కాగితం కుడిచేతిలో, దాని తాలూకు కవరు ఎడమచేతిలో వడగాలికి వణికిపోతున్నాయి.

వెనక్కి ఒరిగిన వాడల్లా ఏదో గుర్తుకొచ్చి నిటారుగా కూచున్నాడు. కాయితమ్మీద మరోసారి కళ్లను పరుగెత్తించాడు. మనసులో మరో ముద్ర పడిపోయింది. దాని తాలూకు నిర్వేదం పెదాలను కదిలించింది. తల పైకి లేచింది. ఎదురుగా గోడకు వేళ్లాడుతున్న 'కవిరాజు' బిరుదు కమ్మగా నవ్వి నేపధ్యంలోకి లాక్కెళ్తుంది.

''కనకారావు మాస్టారు కవిత్వమంటే చెవి కోసుకునే వాళ్లున్నారు. ఆ కవిత్వమో కరుణారస వాహిని. మనసు లోతుల్ని తట్టే భావాలు, ఆ భావాలతో చెట్టాపట్టాలేసుకుని పరుగెత్తే భాష, ఆ రెండింటికి తోడుగా అంతర్వాహినిలా ప్రవహించే అలంకార చమత్కృతి... ఆహా అదో త్రివేణీ సంగమం. రసపిపాసుల నలరించే అమృతవాహిని. మాస్టారు వృత్తిరీత్యా సన్నకారు బడిపంతులైనా కవితా ప్రవృత్తి అతని ఊపిరి. అతని కలం వెలువరించిన ఒక్కొక్క కవిత సానబెట్టిన మణిరత్నం'' బిరుదు ప్రదాన సభలో ముఖ్య అతిధుల ప్రశంసల జల్లు బంగారు కొండనెక్కించింది. స్వర్గలోకంలో విహరిస్తున్న ఆనందానుభూతి ఉల్లాస పరిచింది.

నిజమే. కవిత్వమంటే కాకరకాయ చేదని భయపడేవారు కూడా తన కవితలను అభిమానించారు. మళ్లీ మళ్లీ వినాలనే కుతూహలాన్ని ప్రదర్శించారు.

''మాస్టారు గేయాలు కర్ణపేయాలు. అవి చిల్లర కాగితాల్లో మొహం దాచుకుంటే కవితా కళామతల్లి కంట తడి పెడ్తుంది. కాబట్టి ఆ కవితా సుందరి పుస్తక రూపంలో కన్పించాలి. కవితాభిమానులందరికీ అందుబాటులో ఉండాలి. అందుకు మీరంతా సహకరించాలి''

ఉపాధ్యాయ దినోత్సవంనాడు వందల ఉపాధ్యాయుల ముందు జిల్లా విద్యాశాఖాధికారి వెలిబుచ్చిన ప్రశంస ఆనందడోలికలు ఊగించింది. కానీ ఆ సభలో బెల్లు, బిల్లులకే ప్రాధాన్యతనిచ్చే టీచర్లదే పైచేయి కాబట్టి స్పందన శూన్యమైంది.

వృత్తి, ప్రవృత్తి ఏదైనా సంసార సాగరాన్ని సమర్థవంతంగా ఈదక తప్పదు. భార్యాపిల్లలు నిత్యావసరాల కనుగుణంగా సంపాదనను సరిపెట్టుకోవాలాయె.

పెద్దమ్మాయి పెళ్లితో ఆర్థిక పరిస్థితి బోర్లించిన తప్పేలాలా అయిపోయి కనీస అవసరాలక్కూడా కోత విధించి సర్వీసులో కూడబెట్టిన సంపాదనంతా కట్నాలకు, పెళ్లి ఖర్చులకు కరిగిపోయింది. గుండెలమీది భారం కొంత దిగిందనే తృప్తి మిగిలింది.

కవి సమ్మేళనాల్లో, గోష్టుల్లో తన కవితల్లోని కోయిల రాగాలు, జుంటు తేనియల తియ్యదనాలు శ్రోతలను ఉర్రూతలూగించిన మాట వాస్తవమేకానీ సన్మానాలు శాలువాలకే పరిమితమైపోయినాయి. అన్ని శాలువాలేం చేసుకోవాలి? ఎవరన్నా కొంటారేమో కనుక్కోమ్మని భార్య సరస్వతి సలహా ఇచ్చింది. కానీ వాటిని అమ్మేద్దామంటే మనసు తిరగబడి హెచ్చరించింది.

కవి సమ్మేళనాల్లో, గోష్టుల్లో తన కవితల్లోని కోయిల రాగాలు, జుంటు తేనియల తియ్యదనాలు శ్రోతలను ఉర్రూతలూగించిన మాట వాస్తవమేకానీ సన్మానాలు శాలువాలకే పరిమితమైపోయినాయి. అన్ని శాలువాలేం చేసుకోవాలి? ఎవరన్నా కొంటారేమో కనుక్కోమ్మని భార్య సరస్వతి సలహా ఇచ్చింది. కానీ వాటిని అమ్మేద్దామంటే మనసు తిరగబడి హెచ్చరించింది.

షాపువాడు ''అక్కడ సన్మానాలు, ఇక్కడ శాలువాల అమ్మకాలా?'' అని నిలదీస్తే అది నలుగురికీ తెలిస్తే లోకులు కాకులై పొడుచుకు తినరూ? అబ్బే దాన్ని మించిన నరకం మరోటి వుంటుందా?''

''అన్ని శాలువాలేం చేసుకుంటావోయ్. నాకోటివ్వరాదూ'' అన్న దగ్గరి మిత్రుల కోరిక తీరింది. చలితో వణికిపోయే ఫుట్‌పాత్ జీవులక్కూడా పనికొచ్చాయి. సరదాగా కవితలు విన్న అభిమానుల తలలు దివ్యానుభూతితో ఊగాయి. పెదాలు వణికాయి. కొందరైతే ఆనందం పట్టలేక కౌగలించుకున్నారు. కానీ ఆ కవితలకు విలువ కట్టి మూల్యం చెల్లించే షరాబులెవరు?

ఊహల ఊయలలో ఊగుతూ మల్లెల సౌరభాలలో, జాజుల గుబాళింపులలో అక్షరాలను తడిపేస్తూ ఎన్నో సన్మాన పత్రాలు, అభినందన సందేశాలు రాయడం జరిగింది. అవి రాయించుకున్న పెద్దలు చిరునవ్వులే పారితోషికంగా జిలకరించి రెండు ప్రశంసా పారిజాతాలు విసిరేసి చల్లగా జారుకోవడం పరిపాటైపోయింది.

ఇందుకోసం కవిగారు ఖర్చు పెట్టిందేమీ లేదుకదా! పెట్టుబడి ప్రసక్తే లేదాయె అనే భావం వాళ్ల చూపుల్లో ప్రస్ఫుటమైంది.

కుతకుతలాడిపోవడం తల్లీకూతుళ్లకు మామూలైపోయింది కూడా.

''రాత్రంతా శివరాత్రి జాగారం చేసి బుర్రను కరిగించి పంచరత్నాలు, సన్మానపత్రాలు రాస్తే ఏమొస్తుందండీ కాగితాల ఖర్చు, అనారోగ్యం తప్ప. మీరేం బావుకుంటున్నారు? ఇదే కష్టం ఏ షావుకారు దగ్గరచేసి లెక్కలు రాసినా కొద్దోగొప్పో గిట్టకపోదుకదా!'' భార్య సరస్వతి అధిక్షేపంలోని రుసరుసల్ని పట్టించుకోవాలనిపించలేదు.

''కళ కళకోసమేనన్న రోజులు కావు నాన్నా ఇవి. అడగంది అమ్మయినా అన్నం పెట్టని రోజులివి'' ముగ్గురు కూతుళ్లు ఏకగ్రీవంగా సలహా ఇచ్చారు.


అభిమానాన్ని అరికాలు క్రింద తొక్కేసి ఊపిరి బిగబట్టి అడగాల్సి వచ్చిందోసారి.

''రామ రామా! సరస్వతిని నమ్ముకున్న మీలాంటి తాపసులు ఆమె ప్రసాదించిన వరాన్ని అమ్ముకుంటారా?'' ప్రశ్నే సమాధానమై గుండెల్లో గుచ్చుకుంది. చెంపమీద చెప్పుతో కొట్టినట్టనిపించింది. కాస్సేపు కాళ్లూ చేతులాడలేదు. సరస్వతి మూతులు ఎన్ని వంకర్లు తిరిగితే ఏం లాభం?

ఇహ రచనా వ్యాసంగానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఆలోచన వచ్చిందప్పుడే. కానీ... ఎదలో భావాల హరులు ఎగిరెగిరి పడుతూంటే పదపదమని పదాలు తరుముకొస్తుంటే కలం పట్టనని మనిషి భీష్మించుక్కూచున్నా గట్టు తెంచుకున్న ప్రవాహంలా మనసు నిలువదు. నరాల్లో

సంచలనం, గుండెలనిండా గందరగోళం, ఏదో...మరేదో పిచ్చెత్తిపోతుంది. అంతరంగం వానాకాలం కప్పల చెరువై పోతోంది. ఆ భావ తరంగాలను కాయితమ్మీద కెక్కించే దాకా ఊరట కలగదు. అంతా రాసేస్తే ఆ రోజు తృప్తిగా నిద్ర పడుతుంది.

భావ సంద్రములో మునిగి తేలుతూ ఆ సముద్ర గర్భములోని మణులనేరి, కూర్చి రచనలు సృష్టించాలి. సృష్టించిన రచనను నలుగురికి వినిపించాలి. వాళ్ల



మెప్పులు పొందాలి. అదొక దుర్గ. ఆరని జ్వాల. తీరని వ్యధ. నాటి నుండి నేటివరకూ ప్రతి రచయితా అనుభవిస్తున్నదే. దానికి తాను కూడా వారసుడే.

కవితా కాంతులు అంతటా వ్యాపించాలంటే అక్షర రూపం దాల్చిన ఊహలు పుస్తక రూపంలో నిక్షిప్తం కావాలి. అందుకు డబ్బు పెద్దమొత్తమే కావాలి. ఎవరి ముందు చెయ్యి చాపాలన్నా నామోషీయే. ఒకవేళ అడిగినా ఏం సమాధానమొస్తుందో? భగవాన్! మధ్య తరగతి మందహాసానికెన్ని రంగులు పులిమావయ్యా!

వసంతలక్ష్మికి స్వాగతం పలికేందుకు కవి కోకిలలు సమావేశమయ్యాయి. ఉగాది కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంకు మేనేజర్ కళ్లు తన కవితలు విని ఆనందభాష్పాలు రాల్చాయి. పుస్తక ముద్రణకు బ్యాంకు అప్పు మంజూరు చేస్తుందని ప్రకటించారు పొంగిపోతూ.

మిత్రులంతా పట్టువదలని విక్రమార్కుల్లై అప్లికేషన్ పెట్టించారు. అప్పు మంజూరైందనే చల్లని వార్త వినగానే తన కళ్లు కాంతిరేఖలు వర్షించాయి. పదివేల రూపాయల బ్యాంకు అప్పు భోంచేసి పంచరంగుల ముఖచిత్రంతో కవితా సంకలనం అందంగా అచ్చయింది. మిత్రబృందం విరాళాలతో ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. పట్టు శాలువాతో సన్మానం, ప్రశంసల పరాకాష్ట.

ఆహా! కొన్ని జన్మలెత్తినా తీరదనుకున్న కోరిక ఈ జీవిత కాలంలోనే తీరింది. జన్మ ధన్యమైంది. అనుభవం లేని నిర్వాహకుల ఆవిష్కరణ సభలో వంద కాపీలు సభికుల చేతుల్లోకెళ్లాయి. కవి మిత్రులకు, అప్పుడే సన్నిహితులైన అభిమానులకూ, పెద్దలకూ మరో వంద కాపీలకు రెక్కలొచ్చి ఎగిరిపోయాయి. ప్రచురణల డైరెక్టర్కూ, పత్రికల సమీక్షకులకు, వగైరాలకు మరిన్ని కాపీలు.

అమ్మకానికి హైదరాబాద్ బుక్‌షాపుల్లో కొన్ని కాపీలుంచడం జరిగింది. అమ్మినందుకు విక్రేత కమీషన్ యాభైశాతం. అడ్వాన్సు చెల్లింపు వుండదు. సంవత్సరానికొకసారి లెక్క చూసుకోవాలి.

కవులూ, రచయితలంటే పుస్తక విక్రేతల దృష్టిలో పైసా పావలాకు ఆశపడే పరమ దరిద్రులు. విక్రేత చెప్పిందే వేదం. పుస్తక ముద్రణ ఓ మహా యజ్ఞమని, దానికి రచయిత శక్తియుక్తులన్నీ సమిధలనీ, నిరంతర శ్రమ పెట్టుబడనీ విక్రేతకేం తెలుసు? రచయితలకో సంఘం కరువైపోవడం, వాళ్ల కష్టాన్ని గుర్తించి తగు మూల్యం చెల్లించాలని డిమాండ్ చెయ్యకపోవడం, సమ్మెలు లేకపోవడం విక్రేతలకు శ్రీరామరక్ష.

ప్రతి సంవత్సరం రచయితను నాలుగైదుసార్లు రప్పించుకోవడం వాళ్లకో సరదా.

మూడోసారి హైదరాబాద్ వెళ్లాక కొన్ని పుస్తకాలమ్మిన డబ్బులు చేతికొచ్చాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యం చేతికొచ్చిన రైతులా సంబరపడిపోయాడు.


అప్పటివరకూ బ్యాంకు అప్పు వాయిదాగానీ, వడ్డీగానీ చెల్లించేందుకు వీలుపడలేదు. ఒక్క వాయిదానన్నా చెల్లించాలీ డబ్బుతో...ఆలోచన ఆనందాన్నిచ్చింది. కానీ హైదరాబాద్ నుండి వచ్చాక లెక్క చూస్తే ఖర్చులు పోను మిగిలిందేమీ లేదని తెలిపోయింది.

కాలగమనంలో కలిసే కొత్త స్నేహితులు, ముఖప్రస్తుతి కళాకారులూ, వేలు విడిచిన బంధువులూ, పాఠశాలలకు తనిఖీకొచ్చిన అధికారులూ, అంతా కాంప్లిమెంటరీ కాపీలాశించేవారే. ఎవరి మనసూ కష్టపెట్టరాదనేదే తన అభిమతం.

పైరవీల్లో ఆరితేరిన రచయితల పుస్తకాలనే ప్రభుత్వ గ్రంథాలయాలు కొంటాయట. రోజూ ఉదయం పైరవికి నమస్కరించే తనకు పైరవీల్లో అ ఆ లు కూడా తెలియవు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో రెండో అల్లుణ్ని కొనుక్కోవాల్సి వచ్చింది. రెండో అమ్మాయి పెళ్లయి మూడురోజులు దాటకముందే మూడోసారి బ్యాంకు నోటీసు వచ్చింది. అప్పు ఇప్పించిన మానేజరే ఉన్నడప్పుడు తన పరిస్థితినంతా పూస గుచ్చినట్టు చెప్పి-

''ఏదో ఒక ప్రైవేటు స్కూల్లో చేరిపోతా. పెన్షన్‌తో ఇల్లు గడుస్తుంది. జీతంతో బ్యాంకు వాయిదాలు కట్టేస్తా'' అనాల్సి వచ్చింది.




''అయ్యో! దాందేముంది మాస్టారు! అలాగే కానివ్వండి''

జవాబుతో కడుపు నిండిపోయింది.

ప్రైవేటు స్కూళ్లల్లో మాత్రం ఉద్యోగాలారబోసుకుని కూచున్నారా? ఒకటో అరో ఉన్నా యాజమాన్యం ఇష్టాయిష్టాల మీద నియామకం జరుగుతుంది. తన అసమర్ధతను అందంగా దాచుకుని-

''దిగ్గజాల్లాంటి మీ ప్రతిభకు మూషికమంత జీతమిచ్చి మిమ్మల్ని అవమానపరచలేము. క్షమించండి మాస్టారూ'' రెండు చేతులు జోడించాడ హెడ్మాస్టర్. నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

అవసరాన్ని మించి సరుకులు సప్లయ్ అయినప్పుడు మార్కెట్లో ఆ సరుకుల ధరలు ఢామ్మని పడిపోతాయనేది అర్థిక శాస్త్రం సూత్రం. అలాగే కో అంటే కోటి మంది ఓ అనే నిరుద్యోగులున్న ఈ రోజుల్లో రిటైరైన తనకు ఉద్యోగం దొరక్కపోవడంలో ఆశ్చర్యమేముంది?

పండుగలకొచ్చిన అల్లుళ్లకు, ఇద్దరమ్మాయిలకు, కాన్పులకూ, సారెలకూ, చేబదుళ్లు, చిన్నపాటి అప్పులు తప్పనేలేదు.

ఇప్పుడు-

మూడో అమ్మాయి బాలాకుమారి పెళ్లీడుకొచ్చి గుండెలమీద కుంపటైంది. బ్యాంకు అప్పు మూడింతలై నెత్తిమీద సవారి చేస్తుంది.

''మనింటిముందు చాలామంది గుమిగూడారు ఎందుకు నాన్నా?'' బయట నుండి గాలిగా పరుగెత్తుకొస్తూ అడిగింది బాలాకుమారి.

సరస్వతికి ఆశ్చర్యం వేసింది. బయటకెళ్లి కనుక్కుంది. పొత్తి కడుపులో కత్తి పోటు పడినట్లు రొప్పుతూ-

''అయ్యో! మనిల్లు వేలం వేస్తారటండీ'' అంటూ లోపలికొచ్చింది.

మాస్టారు మౌనవ్రతం వీడలేదు. ఓసారి పైకి, మరోసారి అటూ ఇటూ చూసి వణికే చేతులతో కాయితాన్ని బాలాకుమారికి ఇచ్చాడు. ఇది చదువమన్నట్లు కళ్లతో సైగ చేసాడు.

ఈమధ్య కొత్త కవిత రాయగానే బాలాకుమారికి చూపించడం అలవాటైంది.

''బయట గోడవైపోతుందంటే మీకు చీమ కుట్టినట్టయినా లేకపోతే ఎలాగండీ?''

''ఈ కవిత సంగతి తర్వాత చూద్దాం నాన్నా''

''ముందది చదివి మీ అమ్మకు చెప్పమ్మా''

గబగబా చదివేసింది.

''ఇది బాంకు నోటీసమ్మా. మూడ్రోజుల్లో అప్పు, వడ్డీ కట్టకపోతే ఇల్లు జప్తు చేస్తామని...'' కళ్లను నీటి తెరలు కమ్మేస్తున్నాయి.

''ఈ ఇల్లును గ్యారంటీగా పెట్టుకునే కదమ్మా బ్యాంకు అప్పిచ్చింది''

దుఃఖం, ఉక్రోశం కలిపి పొంగుకొచ్చాయి సరస్వతిలో.

''మీరు నిన్నో మొన్నో ఎండలో తిరిగి జ్వరం పాలైంది ఇందుకేనా? మాకొక్క మాట కూడా...''

''చెబితే ఏం చేసేదానివి?''

నిజమే. ఏం చేయగలిగేది? ఏమీలేదు.

''తొక్కరాని గుమ్మాలెన్నో తొక్కాను. సిగ్గూ లజ్జా గాలికొదిలేసి అడగరాని వాళ్లనెందరినో అడిగాను. కానీ ఏ గుండె కరగలేదు సరస్వతీ'' మాస్టారు గుండెల్లో పాశర్ల పూడి బ్లోఅవుట్ మంటలు.

''నాగరాజుగారి పాట పదిహేను వేలు...'' ఇంటి బయట మైకు గొంతెత్తి అరుస్తుంది.

ముగ్గురి గుండెల్లో అణుబాంబులు పేలాయి.

''అయ్యో! ఇప్పుడెట్లా నాన్నా? ఇది మన ముత్తాతల నాటి ఇల్లు''

''హయ్యో! మీ నాన్నగారు మనకిచ్చిన ఒకే ఒక ఆస్తండీ ఇదీ''

''వెంకట్రాజుగారి పాట పదిహారువేలు...పదహారు వేలు...''

సరస్వతి నరాల్లో నాగుపాములు పాకుతున్నాయి.

''మిగిలిన పుస్తకాలన్నీ వాళ్లకిచ్చేస్తే వేలం ఆపుతారేమో అడగండీ'' పుస్తకం కాపీ తెచ్చి భర్త చేతికిచ్చింది.

ఆ పుస్తకాన్ని కళ్లకద్దుకుని గుండెలకు హత్తుకున్నాడు. ఏదో హాయి.

''వామనరావుగారి పాట పదిహేడువేలు...పదిహేడు వేలు మాత్రమే''

ఇల్లు లేకపోతే ఎక్కడుండాలి? అయ్యయ్యో! ఎంత పనైపోతోంది? ఎడారిలో తోవ తప్పినట్టనిపించింది బాలాకుమారికి.

''ఇప్పుడెలా నాన్నా?''

''నారాయణరెడ్డిగారి పాట పదిహేడు వేల ఐదొందలు...పదిహేడువేల ఐదొందలు...''

ఏమిటీ మౌనం? సరస్వతి మనసాగలేదు.


''అబ్బా చెప్పండి...ఏం చేద్దాం? ఎక్కడికెళ్దాం చెప్పండి?'' పడక్కుర్చీలో కూర్చున్న భర్త భుజాలు పట్టి కుదిపింది. కవిరాజు కనకారావు వెనక్కి వాలిపోయాడు. చేతులు విడిపోయినాయి. గుండెలమీద కవితా సంకలనం 'ఓ పూవు రాలింది' జారి నేలమీద పడిపోయింది.

లోపల రెండు ఆడగొంతులు గొల్లుమన్నాయి. బయట పందొమ్మిదివేల వద్ద వేలం పాట చెల్లయిపోయింది.

''మిగతా అప్పు ఎట్లా వసూలు కావాలో...'' కొత్త మానేజరు కసురుకుంటున్నాడు.

★

## కుర్రాడు అనిల్



అనిల్ కపూర్ తమ్ముడు సంజయ్ కపూర్‌కే ముప్పయ్యేళ్లు దాటిపోయాయి 'బెండకాయ ముదిరినా...' అనే సామెతని గుర్తు చేసుకుంటూ రాబోయే డిసెంబరులో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. ఆ లెక్కన అనిల్ కపూర్ వయసు ఎంత వుంటుందో అంచనా వేసుకోవడం ఏమంత కష్టం కాదు. నలభైల్లో వున్న ఈ 'కుర్ర' హీరో ఇప్పుడు ఈ వయసులో ఓ కాలేజీ స్టూడెంట్ పాత్రని పోషించడం విడ్డూరంగానే అనిపిస్తుంది మరి! చాలా కాలం తర్వాత హృషీకేష్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న 'ఝూట్ బోలే కవ్వా కాటే' అనే సినిమాలో అనిల్ కపూర్ కాలేజీ స్టూడెంట్‌గా మనకి దర్శనం ఇవ్వబోతున్నాట్ట. 42 ఏళ్ల హీరో 24 ఏళ్ల స్టూడెంట్‌గా తన 'కుర్ర'తనాన్ని ప్రదర్శించబోతున్నాడన్నమాట.

-జె.ఎం.